ISSN 2581-3978
ఆగస్టు 2023 సంపుటి 9, సంచిక 5 రూ. 20

# తెలంగాణ

మాస పత్రిక





## ఇదిగో.. పోడు పట్టా

## అల్లూరి జీవితం అందరికీ ఆదర్శం 18





24 కరువుకు చుక్కెదురు కాళేశ్వరం ప్రాజెక్టు



28 దాశరథి కలల సాకారం



32 చీకటి నుంచి వెలుగులోకి



38 ప్రజా యుద్ధగీతం సాయిచంద్

| | |
|---|---|
| పోడు రైతుల జీవితాల్లో వెలుగు | 6 |
| నెరవేరిన ఆదివాసీల చిరకాల వాంఛ | 9 |
| పోడు పట్టాల పండుగ | 10 |
| ముంచెత్తిన వానలు..అప్రమత్తమైన ప్రభుత్వం | 12 |
| వీఆర్ఏలకు కేసీఆర్ వరాలు.. పే స్కేల్ అమలు | 14 |
| దివ్యాంగుల పింఛన్, డైట్ చార్జీల పెంపు | 16 |
| పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ | 17 |
| ధాన్యం రాశులతో కనక వర్షం | 20 |
| తాతగారి అడుగుజాడల్లో ..... | 21 |
| నానమ్మపై ప్రేమతో... | 22 |
| సమాచార భవన్‌లో బోనాల సందడి | 29 |
| చల్లంగ చూడు తల్లీ! | 30 |
| త్యాగధనులు | 33 |
| కాళేశ్వరం విలువ కష్టకాలంలోనే తెలుస్తుంది | 34 |
| మైనారిటీలకూ లక్ష సాయం | 35 |
| ప్రపంచస్థాయి నాణ్యత మన సొంతం | 36 |
| పంటనష్ట పరిహారం 304 కోట్లు | 37 |
| 'టమాటా' శ్రీమంతునికి కేసీఆర్ అభినందనలు | 41 |
| మట్టిని రక్షించు | 44 |
| రైతులకు వరప్రదాయిని ఆయిల్ పామ్ సాగు | 48 |
| ప్రారంభోత్సవానికి సిద్ధమైన మీడియా అకాడమీ భవనం | 50 |
| పేదరికం తగ్గుముఖం | 51 |
| తెలంగాణ అవతరణ అనంతరం సాహిత్య వికాసం | 52 |
| నా తెలంగాణ | 58 |


# తెలంగాణ అవతరణ అనంతరం
# సాహిత్య వికాసం

తెలంగాణ సాధించుకున్న తర్వాత సాహిత్యం కూడా కొత్త వెలుగును నింపుకుంది. అస్తిత్వాన్ని అన్వేషించుకుంది. స్థానాన్ని నిర్దేశించుకుంది. చిత్రపరిశ్రమలో ఇంతకాలంగా తెలంగాణ భాషను వ్యంగ్యంగా చిత్రించిన దశనుండి ఆ భాష సొగసులను, సౌందర్యాన్ని, మాధుర్యాన్ని తెలిజేస్తూ వెండితెరపై మెరుపులు ప్రదర్శించింది. పార్యగ్రంథాలలో ప్రజ్వలింపచేసింది. ప్రతి కవి తన కవిత్వాన్ని, కథను స్వీయభాషలో రాసుకుంటున్నాడు. ఎన్నో ప్రక్రియలలో ఈ ప్రాంతీయులు చేసిన సేవను సాహిత్యం కొత్తగా నిరూపించుకుంది. కనుమరుగైన కథలు వెతుక్కుంది. నాచుపట్టిన నవలలను సాహితీ సంద్రంలో నుండి వెలికితీసింది. కథ, నవల రెండూ ఈ ప్రాంతం నుండే మొదటగా వచ్చాయని నిరూపించుకుంది. విరబూసిన పాటను రకరకాలుగా విస్తరింపచేసింది.

**ఇంత విస్తృతంగా పాటను రాయగల సామర్థ్యం ఈ ఉద్యమాల గడ్డకే ఉందని వేనోళ్ళతో వినిపించింది. శాసనాలను తుడుచుకుని చరిత్రను సవరించుకుంది. కుట్రకు గురైన కావ్యాలను, కవులను కలుపుకుని కొత్తగా సాహిత్య చరిత్రలను నిర్మించుకుంది. ఈ విధంగా తెలంగాణ సాహిత్య, భాషాంశాలకు నూతన వైభవాన్ని సంతరింపచేసుకుని సాహిత్య చరిత్రలను సక్రమంగా రూపొందించుకుంది. ఇలాంటి సాహిత్య వికాస యజ్ఞంలో సాహిత్య సంస్థలు, అకాడమీలు, విశ్వవిద్యాలయాలు, సంస్థలు, కొందరు పరిశోధకుల కృషి శ్లాఘనీయమైనంది. ఈ వికాసాన్ని అంచన వేయడానికి ప్రక్రియల వారీగా పరిశీలిద్దాం.**

**డా. అట్టెం దత్తయ్య**

**కథ :** పరిశోధనలో, సృజనలో ఊహించనంత స్థాయికి ఎదిగిన సాహిత్య ప్రక్రియ కథానిక. తెలుగు ప్రపంచంలోనే తొలి తెలుగు కథ ఈ ప్రాంతం నుండే వచ్చిందని నిరూపిస్తూ పాత కథలను ఎన్నింటినో వెలుగులోకి తెచ్చారు. 'తెలంగాణ తొలితరం కథలు', 'తొలినాటి కతలు', అనే సంకలనాలలో విస్మృతికి గురైన తెలంగాణ కథలను ముద్రించారు. బండారు అచ్చమాంబ కథలు, ఆవుల పిచ్చయ్య కథలు, బొమ్మ హేమాదేవి కథలు వంటి మొదటితరం వారి కథలను వెలికితీసి అందించారు. 'తెలంగాణ కథ' శీర్షికతో ప్రతి సంవత్సరం సంగిశెట్టి శ్రీనివాస్, వెల్దండి శ్రీధర్‌లు కథల సంకలనాన్ని తీసుకువస్తున్నారు. సాహిత్య అకాడెమి ప్రచురించిన 'అస్తిత్వ' కథల సంపుటి ఆంగ్లం, హిందీ భాషల్లోకి కూడా అనువదించి తెలుగేతరుల దగ్గరకు తీసుకువెళ్ళారు. ఇవే కాకుండా జిల్లాలవారిగా 'వరంగల్ కథలు', 'నల్గొండ కథలు', 'కరీంనగర్ కథలు', 'ఖమ్మం కథలు', 'మెతుకు కతలు' వంటి సంకలనాల గొప్ప క్రోడీకరణ జరిగింది. అట్లాగే అస్తిత్వాల వారిగా 'తెలంగాణ చౌక్' (తెలంగాణ ఉద్యమ తొలికథా సంకలనం), 'తెలంగాణ దళిత కథలు', 'వేపకాయంత నిజం'(యాదవ కథలు), 'వలస కథలు', 'మల్లెసాలె'(శతాధిక చేతివృత్తి కథలు) 'కేసుల' (గోర్ బంజార కథలు) వంటివి కూడా వచ్చాయి.




పిల్లల కథలకు సంబంధించిన పుస్తకాలు జిల్లాల వారిగా దక్కన్‌లాండ్ పత్రికనుండి ప్రచురించి ఒక కొత్త ఒరవడిని సృష్టించారు.

తెలంగాణ సాధన అనంతరం సంవత్సరాల వారిగా చూసినపుడు చాలా కథా సంపుటాలు దర్శన మిస్తాయి. అందులో మచ్చుకు కొన్నింటిని స్పృశిద్దాం. 'ఇంతకు ఇంతే' (2014) పోల్కంపల్లి శాంతాదేవి; 'కథలకి ఆవల' (2014) మంగారి రాజేందర్; 'కపిలవాయి లింగమూర్తి కథానికలు' (2015) కపిలవాయి లింగమూర్తి; 'బేచారే' (2015), 'అలాయిబలాయి' (2015) స్కైబాబ; 'అడవిలో వెన్నెల'(2015), 'కాలం తెచ్చినమార్పు' (2015) బి.ఎస్.రాములు; 'యక్షగానం'(2016) దేవులపల్లి కృష్ణమూర్తి; 'పొరలు'(2016) స్వాతిశ్రీపాద; 'తప్ష' (2016) సిద్దెంకి యాదగిరి; 'తెలంగాణ వెలుగులు' (2017) 'ఇజ్జత్ పోయింది' (2017) కాలువ మల్లయ్య; 'తల్లిచేప' (2017) అల్లంరాజయ్య; 'మా ఫణిగిరి గుట్ట కథలు' (2018) శిరంశెట్టి కాంతారావు; 'ఆలోచనలో ఆమె' (2018) శాంతి ప్రబోధ; 'హీరాలాల్ రాయ్

కథలు', 'కథానిక గుచ్ఛం', 'పరిసరాలు', 'సురవరం ప్రతాపరెడ్డి కథలు' ఇవన్నీ 2019లో తెలంగాణ సాహిత్య అకాడమి ముద్రించింది. 'కథమానం భవతి' (2021) కే.వి.నరేందర్; 'నలుపు' (సమగ్ర కథా సంపుటాలు-2) (2023) పి.చంద్ వంటి అనేక కథాసంపుటాలు, సంకలనాలు వెలువడ్డాయి. తెలంగాణ నుండి వచ్చిన ఈ కథలు తెలంగాణ సంస్కృతి, భాష, ప్రాంతీయ, కుల, మత, వ్యక్తిత్వ, అస్తిత్వాలకు అద్దం పడుతున్నాయి. వీటి ద్వారా తెలంగాణ సామాజిక, రాజకీయ, ఆర్థిక స్థితిగతులను అంచన వేయవచ్చు.


## నవల:


తెలంగాణ సాహిత్యంలో నవల పాత్ర చాల విశాలమైంది. తెలంగాణ జీవన విధానాన్ని, ఉద్యమాన్ని, పోరాటాన్ని, విపులంగా నవల మాత్రమే చిత్రించగలిగింది. వాటికి నిదర్శనాలే వట్టికోట ఆళ్వారుస్వామి 'ప్రజల మనిషి', దాశరథి రంగాచార్య 'చిల్లర దేవుళ్ళు', 'మోదుగు పూలు' వంటివి. అనంతరం విప్లవోద్యమాలను చిత్రించినవి చెరబండరాజు 'మా పల్లె', అల్లం రాజయ్య 'కొలిమంటుకుంది', నవీన్ 'అంపశయ్య' వంటి నవలలు. తెలంగాణ సాధన అనంతరం పరిశోధనలో తేల్చిన విషయం ప్రకారం మొదటి నవలగా తడకమల్ల కృష్ణారావు 'కంబుకందర చరిత్ర'ను నిర్ణయించారు. ఈ ప్రక్రియ చరిత్ర, వికాసాన్ని తెలియజేస్తూ వచ్చిన పుస్తకాలలో 'తెలంగాణ నవలా చరిత్ర' (2017) సంగిశెట్టి శ్రీనివాస్, 'తెలంగాణ నవలా వికాసం' కాసుల ప్రతాపరెడ్డి, 'తెలంగాణ నవలా సాహిత్యం' టి.శ్రీరంగస్వామి వంటివి తెలంగాణ నవలా సాహిత్యానికి అద్దం పడుతాయి.

కొన్ని నవలలను పరిశీలిస్తే 'చూపు' (2014) బి.ఎస్.రాములు; 'ఎక్కడి నుండి? ఎక్కడి దాకా? (2014) రామా చంద్రమౌళి; 'ఏ వెలుగులకీ ప్రస్థానం' (2014) అంపశయ్య నవీన్; 'మాదిగ విజయం' (2015) కాలువ మల్లయ్య; 'ప్రజాజ్యోతి పాపన్న' (2015) ఎస్.ఎం. ప్రాణ్‌రావు; 'అదవి' (2015) వసంతరావు దేశపాండే; 'కర్మభూమి' (2016) ఐతా చంద్రయ్య; 'గుల్ మొహర్' (2016) పోల్కంపల్లి శాంతాదేవి; 'సృష్టిలో తీయనిది' (2014) అమృతలత; 'మూడు ముక్కలాట' (2017) దేవులపల్లి కృష్ణమూర్తి; 'జిగిరి' (2017) పెద్దింటి అశోక్ కుమార్; 'కొంగవాలు కత్తి' (2018) గద్దం మోహన్‌రావు; 'కౌసల్యా సుప్రజా రామ' (2018) తాటికొండాల నరసింహారావు; 'మృత్యోర్మా అమృతంగమయ' (2018) మల్లవరపు చిన్నయ్య; 'కుట్ర' (2019) ప్రభాకర్ జైని; 'మై గరీబ్ హు' (2019) కవిరాజమూర్తి; 'లాంగ్ మార్చ్' (2019) పెద్దింటి అశోక్ కుమార్; 'కిరటం' (2020) తాళ్ళపల్లి యాకమ్మ; 'తల్లులు కూతుర్లు'(2022) హుస్సేన్; 'రేపు తిరుగబడితే' (2013) పులికొండ సుబ్బాచారి; 'ప్రేమ పవనాలు - మానవతా సౌరభాలు' (2023) గులాబీల మాల్లారెడ్డి వంటి నవలలు తెలంగాణ అవతరణ అనంతరం వెలువడిన నవలా సాహిత్య వికాసానికి నిదర్శనాలుగా నిలుస్తాయి.

## కవిత్వం:

తెలంగాణ వచన కవిత్వం వ్యక్తీకరణ, శైలి, భాష వంటి వాటిన్నిటిలో ప్రాంతీయ ముద్రను వేసుకుంది. చెప్పదల్చుకున్న అంశాలన్ని ఇంతకు ముందుకంటే ధైర్యంగా, సూటిగా, తనదైన పద్ధతిలో చెప్తున్నట్లు కనిపిస్తుంది. ఎన్నో సంస్థలు అనేక సందర్భాలలో రకరకాల అంశాలపై సంకలనాలను తీసుకువచ్చాయి. అందులో 'తొలిపొద్దు' (2015), 'తంగేడు వనం' (2015), 'ఆకుపచ్చని పొద్దుపొడుపు' (2017) వంటి సంకలనాలను తెలంగాణ భాషా సాంస్కృతిక సంస్థ ముద్రించింది. 2014 తర్వాత వ్యక్తిగతంగా తీసుకువచ్చిన కవితా సంపుటాలు అసంఖ్యాకం. వాటిలోనుండి కొన్నిటిని స్పృశిస్తే 'ఇక్కడి చెట్లు గాలి' (2014) నందిని సిధారెడ్డి; 'అసంపూర్ణ' (2014) రామా చంద్రమౌళి; 'మాటల మడుగు' (2014) మార్గరేట్ మెర్సీ; 'కాశీం కవిత్వం' (2015) కాశీం; 'చెట్టును దాటుకుంటూ'(2015) జూకంటి జగన్నాథం; 'ఎర్రగాలు' (2015) కూకట్ల తిరుపతి; 'బ్రేకింగ్ ఫ్యూస్' (2015) కోట్ల వెంకటేశ్వరరెడ్డి; 'బొమ్మలబాయి' (2015) సిద్ధార్థ;




'లంద పొద్దు' (2016) నిరంజన్ గుడిపల్లి; 'తెలంగాణ పదాలు' (2016) ఐతా చంద్రయ్య; 'నిర్భయకాశం కింద' (2016) రజిత అనిశెట్టి; 'తావు'(2016) సుంకిరెడ్డి నారాయణరెడ్డి; 'ఎనిమిదో అడుగు'(2017) కొండపల్లి నీహారిణి; 'అనుసృజన' (2017) నిఖిలేశ్వర్; 'తెలంగాణ తేనెపలుకు' (2017) వనపట్ల సుబ్బయ్య; 'మూల మలుపు' (2018) ఏనుగు నరసింహారెడ్డి; 'కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్' (2018) కూరెల్ల విఠలాచార్య; 'నీటి మనుసు' (2019) నందిని సిధారెడ్డి; 'నడక బోనం' (2019) కొమురవెల్లి అంజయ్య; 'దండ కడియం' (2019) తగుళ్ళగోపాల్; 'అన్నవరం దేవేందర్ కవిత్వం' (2022) అన్నవరం దేవేందర్ వంటి కవిత సంపుటాలతోపాటు చాలామంది కవిత్వ సంపుటాలు కనిపిస్తున్నాయి. ఈ కవిత్వంలో తెలంగాణ జీవన సౌందర్యానికి, వ్యథలకు,

సమస్యలకు చిత్రిక పట్టారు. కవిత్వం కూడా అనేక రకాల వ్యథలను, ఉద్యమాలను ఆవిష్కరింపడానికి ఉపయోగ పడుతుందని నిరూపించారు.

విమర్శ విస్తృతమైనది. తెలంగాణ సాహిత్య విమర్శ అన్నికోణాలలో ముమ్మరంగా సాగుతూనే ఉంది. జిల్లాల వారిగా సాహిత్య చరిత్రలు రావడంతో విమర్శ పరిపుష్టం అయ్యిందని చెప్పడానికి నిదర్శనం. 'తెలంగాణ సాహిత్య చరిత్ర'లు ముదిగంటి సుజాతరెడ్డి, ఎస్.వి.రామారావు, సుంకిరెడ్డి నారాయణరెడ్డి తీసుకురాగ, తెలంగాణ సాహిత్య అకాడెమి 'తెలంగాణ సమగ్ర సాహిత్య చరిత్ర'ను తెలుగు అకాడమి 'తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర'ను ముద్రించాయి. అట్లాగే నీల్‌కమల్ పబ్లికేషన్స్ సంస్థ బాలశ్రీనివాసమూర్తి సంపాదకుడుగా 'తెలంగాణ సాహిత్య చరిత్ర' (మూడు సంపుటాలు), 'తెలంగాణ వైతాళికులు' (మూడు సంపుటాలు) చాల అంశాలను పరిశీలించాయి. సాహిత్యంలో గల అన్ని ప్రక్రియలను వివిధ వ్యక్తులతో రాయించి 'కదంబం' (2014) పేరుతో సాగి కమలాకరశర్మ సంపాదకులుగా 'మూసీ' పత్రికవారు తీసుకువచ్చారు. వీటితో పాటు 2014తర్వాత వచ్చిన సాహిత్యాన్ని పరిశీలించిన, విశ్లేషించిన విమర్శ గ్రంథాలు ఎన్నో కొనియాడ దగినవి. వాటిలో నుండి మచ్చుకు 'అద్యతన దృష్టి' (2014) ముదిగంటి సుజాతరెడ్డి; 'ఈ నాటి కవిత' (2014) ఎం. నారాయ-ణశర్మ; 'తెలంగాణ తెలుగు నవల' (2014) సం. పంతంగి వెంకటేశ్వర్లు; 'తెలంగాణ సంస్కృతి తొలి ఆవిష్కర్త పాల్కురికి సోమనాథుడు' (2015) సం.అనుమాండ్ల భూమయ్య; 'తెలంగాణ సాహిత్య పీఠికలు' (2016) బన్న అయిలయ్య; 'తెలంగాణ యాస బాస' (2016) కసిరెడ్డి వెంకటరెడ్డి; 'తెలంగాణ భాష' (2016) కాలువ మల్లయ్య; 'తెలంగాణ పద్య కవితావైభవం' (2016) గంగ్ర లక్ష్మణరావు; 'ప్రాంతీయ అస్తిత్వం తెలంగాణ కథ, నవల' (2017) బి.ఎస్.రాములు; 'సహృదయ సాహిత్య విమర్శ – వైవిధ్యం' (2018) అమ్మంగి వేణుగోపాల్; 'పటువు' (2018) బి.వి.ఎన్.స్వామి; 'అంతరంగం'(2018) ఏనుగు నరసింహారెడ్డి; 'తెలుగు నవల ప్రయోగ వైవిధ్యం' (2019) కె.పి.అశోక్; 'సమన్వయ' (2021) ఎస్.రఘు; 'దుర్భిణి' సంగిశెట్టి శ్రీనివాస్; 'తెలంగాణ బిసివాద సాహిత్యం' (2021) అట్టెం దత్తయ్య; 'అక్షరమాల' (మొత్తం 6 సంపుటాలు) (2022) వెలుదండ నిత్యానందరావు; 'ద్విచక్రం' (2022) ఆడెపు లక్ష్మీపతి; 'తరాజు' కాంచనపల్లి గోవర్ధనరాజు ఇలాంటి అమూల్య గ్రంథాలు కవులను, కావ్యాలను, ధోరణులను, వాదాలను, ఉద్యమాలను వివరించి, విశ్లేషించిన గ్రంథాలు.






**పాట :**

పాటకు పరుగెత్తడం నేర్పింది తెలంగాణ ఉద్యమం. తొలి, మలిదశల ఉద్యమాలలో వచ్చిన పాటలు అనంతం. అందులో సాధ్యమైనన్ని సేకరించి 'నిప్పులవాగు' (తెలంగాణ ఉద్యమపాట) పేరుతో అందెశ్రీ సంపాదకుడిగా వెలువరించారు. ఇది 745 కవితలు, గేయాలతో రూపొందించిన గ్రంథం. 'తెలంగాణ పదసంకీర్తనలు' (2019) (సం.) పి. భాస్కరయోగి గ్రంథం వందల మంది కీర్తనకారులను పరిచయం చేసింది. విప్లవ రచయితల సంఘం ప్రచురించిన 'తెలంగాణ పోరాట పాటలు' (1972), రెండవ సంపుటి (1977)వచ్చింది. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ప్రచురించిన 'తెలంగాణా పోరాట గేయాలు' (1973).సాహితీ సర్కిల్ హైదరాబాద్ 'తెలంగాణ పోరాట పాటలు' (1990) ప్రజాశక్తి బుక్ వారు 'బండెనక బండి కట్టి... (వీర తెలంగాణా పోరాట పాటలు) (2006) వంటివి తెలంగాణ ఉద్యమ పాటలను ఒకచేటికి తీసుకు వచ్చిన పుస్తకాలు. వీటి అనంతరం ఆగకుండా ఎందరో వారివారి గ్రంథాలను వెలువరిస్తూనే ఉన్నారు. 'నాగేటి సాల్లల్ల' (2014) నందిని సిధారెడ్డి; 'తుంగు' (తెలంగాణ పాటలు) (2015) అంబటి వెంకన్న; 'తెలంగాణ వైభవ గీతములు' (2015) సబ్బని లక్ష్మీనారాయణ; 'పల్లెసుద్దులు'(2015) వల్లంపట్ల నాగేశ్వరరావు; 'వసంత గీతం' (2016) జయరాజు; 'నా పాటలు' (2017) సుద్దాల అశోక్‌తేజ; 'సబ్బండ నాదం' (2017) ముద్దంగుల ఎల్లన్న; 'కైతల కవాతు'(2019) మిత్ర; 'స్ఫూర్తిపాటలు' స్ఫూర్తి మొదలగు వారు వారివారి పాటలను పుస్తకాలుగా తీసుకువచ్చారు. పుస్తకాలుగా మాత్రమే కాకుండా సి.డి.ల రూపంలో, యూట్యూబ్‌లో కూడ అందుబాటులో ఉంచారు.

**నిఘంటువులు :**

తెలంగాణ భాష ప్రామాణికమైనది కాదు అంటూ హేళన గురైంది. తెలంగాణ సాధన అనంతరం వాడుక భాషే ప్రామాణికమైన భాషగా నిరూపించుకుంది. వ్యాకరణాన్ని సిద్ధం చేసుకుంటుంది. నిఘంటువులను

తయారు చేసుకుంది. 'తెలంగాణ పదకోశం', 'తెలంగాణ పదబంధ కోశం' నలిమెల భాస్కర్. 'పామర సంస్కృతం'(పాలమూరు మాదలికం) కపిలవాయి లింగమూర్తి; 'గుమ్మి' (తెలంగాణ వాడుక భాషా పలుకులు, పలుకుబడులు) కాలువ మల్లయ్య; 'తెలంగాణ వ్యవహార పదకోశం' ముదిగంటి సుజాతరెడ్డి; 'తెలంగాణ నిఘంటువు' – తెలుగు విశ్వవిద్యాలయం వంటి తెలంగాణ భాషకు సంబంధించిన ప్రత్యేక నిఘంటువులు. తెలంగాణ సాహిత్య వికాసం సంస్థల పరంగా తక్కువ సమయంలో ఎక్కువగా జరిగింది. ప్రభుత్వేతర సంస్థలు కూడా దీక్షగా పనిచేస్తున్నవి కొన్ని ఉన్నాయి.

**తెలంగాణ సాహిత్య అకాడెమి :**

2017లో ఆవిర్భవించిన 'తెలంగాణ సాహిత్య అకాడెమి' ఘనంగా మహాసభలు నిర్వహించి, మహోన్నత ఆవిష్కరణలు చేసింది. తెలుగు సాహిత్యాన్ని దేశవిదేశాలకు పరిచయం చేసింది. ముఖ్యంగా 130కి పైచిలుకు ప్రామాణిక పుస్తకాలను ప్రచురించింది. ఇందులో అవసరానుకూలమైన గ్రంథాలను విషయనిపుణులతో రాయించింది. కొన్ని విస్మృతికి గురైన పాత పుస్తకాలను పునర్ముద్రించింది. ప్రత్యేకంగా జిల్లాల వారిగా సాహిత్య చరిత్రలు, తెలంగాణ సమగ్ర సాహిత్య చరిత్ర, తెలంగాణ కావ్య పరిమళం, 'అస్తిత్వ' తెలంగాణ కథలు, 'పరంపర' తెలంగాణ కవిత్వం, తెలంగాణ చరిత్ర గ్రంథాల వంటివాటిని ముద్రించుకోవడం ద్వారా తెలంగాణ సాహిత్య చరిత్రకు మరో వంద సంవత్సరాల ఆయువును పోసింది. ఇంకా సదస్సుల పేర్లలో వివిధ ప్రక్రియల సాహిత్యాన్ని పరిశీలనకు, పరిశోధనకు ప్రేరేపించింది. 'తెలంగాణ సాహిత్య గ్రంథ సూచి' వంటి ప్రామాణిక గ్రంథాలు ముద్రణలో ఉన్నాయి. నవలల పోటీలను నిర్వహించి బహుమతులతో ప్రోత్సహించింది. తెలంగాణ సాహిత్య అకాడమి అవార్డుల పేర్లతో గొప్ప రచయితలను గుర్తించింది.

**తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ :**

తెలంగాణ సాధన అనంతరం 'భాషా సాంస్కృతిక శాఖ' సాహిత్యానికి, సంస్కృతికి, భాషకు, సినిమాకు, కళలకు పెద్దపీట వేసింది. సాహిత్య సదస్సులకు ఆర్థిక సహాయం చేస్తూ ప్రేరేపిస్తుంది. జానపద, పద్య, వచన కవిత సంపుటాలను ప్రచురించింది. 'తొలిపొద్దు', 'కొత్తసాలు', 'తంగేడు వనం', 'మట్టిముద్ర', 'పద్యతెలంగాణం' వంటి అపురూప గ్రంథాలను అందించింది. 153మంది తెలంగాణ మహనీయుల జీవిత పరిచయ వ్యాసాలు కలిపి 'తెలంగాణ తేజోమూర్తులు', 27 కళారూప పరిచయ వ్యాసాలు 'కళా తెలంగాణం', 20మంది స్మరణీయ సంకీర్తనకారుల పరిచయ వ్యాసాలతో 'తెలంగాణ వాగ్గేయ వైభవం' వంటి పుస్తకాలను ముద్రించి తెలంగాణ సాహిత్య వైభవాన్ని మరింత ప్రసరింపచేసింది. తెలంగాణ అవతరణ అనంతరం 'కాళోజి అవార్డు', 'దాశరథి అవార్డు' పేర్లతో వారివారి జన్మదినాల సందర్భంగా అమ్మంగి వేణుగోపాల్, మృత్యుంజయ శర్మలతో ప్రారంభించి ఎందరో సాహితీ దిగ్గజాలను సన్మానించుకుంటుంది.


**తెలుగు అకాడెమి :**

తెలుగు అకాడెమి ప్రపంచ తెలుగు మహాసభల సమయంలో తెలంగాణ మహనీయులను, వారివారి కృషిని ఎంతగానో వెలికితీసి గ్రంథస్థం చేసింది. 'లోకమలహరి', 'రావి నారాయణరెడ్డి', 'బి.ఎన్.శాస్త్రి' మొదలగు సాహితీ మూర్తుల, ఉద్యమకారుల, చరిత్రకారుల మొదలగు వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన వందమంది మోనోగ్రాఫ్‌లను ముద్రించి ముందు తరాలకు వారి స్ఫూర్తిని అందించింది. అదే సమయంలో తెలంగాణ సాహిత్య సంబంధిత మరో 150కి పైచిలుకు పుస్తకాలతో తెలంగాణ సాహిత్యం తక్కువకాలంలో పరివ్యాప్తికి తోడ్పడింది.

**తెలంగాణ సారస్వత పరిషత్ :**

ఆంధ్ర సారస్వత పరిషత్ తెలంగాణ సారస్వత పరిషత్‌గా పేరు మార్చుకొని తెలంగాణ సాహిత్యానికి ప్రత్యేక శ్రీకారం చుట్టింది. 'తెలంగాణ సాహిత్య చరిత్ర', 'తెలంగాణ చరిత్ర', 'తెలంగాణ మాండలికాలు కావ్య ప్రయోజనాలు', 'తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలు' వంటి తెలంగాణ



సాహిత్య సంబంధిత గ్రంథాలను ముద్రించింది. 'పరిణత వాణి' పేర్లతో తెలంగాణలో గల ప్రముఖ సాహితీవేత్తల ఆత్మకథ ప్రసంగాలు ఇప్పించి, ఆ వ్యాసాలను పుస్తకాలుగా తీసుకురావడం ముదావహం. ప్రస్తుతం పరిషత్ 'జిల్లా సర్వస్వాలు' పేర్లతో 33జిల్లాల సర్వస్వాలను తీసుకువస్తుంది. ఇప్పటివరకు అధికసంఖ్యలో వచ్చాయి. ఈ గ్రంథాల వల్ల ప్రతిజిల్లాలో ఉన్న చారిత్రక అంశాలు, సాహిత్య అంశాలు, సాంఘికాంశాలు, ఆర్థికాంశాలు, కవులు, కావ్యాలు వంటి అన్ని అంశాలను లోతుగా పరిశీలిస్తూ గ్రంథస్థం చేస్తున్నారు. ఈ గ్రంథాలు తెలంగాణ సాహిత్య వికాసానికి, విస్తృతికి బాగా ఉపయోగపడుతుంది. వివిధ ప్రక్రియలలో ప్రతిభ కనపరుస్తున్న వారిని ప్రతి సంవత్సరం ఎంపికచేస్తూ అవార్డులను అందిస్తుంది.

## తెలుగు విశ్వవిద్యాలయం:

తెలంగాణలో గల అన్ని విశ్వవిద్యాలలో కంటే తెలుగుసాహిత్యానికి, కళలకు ఈ విశ్వవిద్యాలయం పెద్దపీట వేసింది. సాహిత్య గ్రంథాల ముద్రణకు ప్రతిసంవత్సరం ఆర్థిక సహాయం అందిస్తుంది. వివిధ ప్రక్రియలలో ప్రసిద్ధ గ్రంథాలను ఎంపిక చేసి అవార్డులు ప్రకటిస్తుంది. ఇది తెలంగాణ సాహిత్య లోకానికి గొప్ప ప్రోత్సాహంతో కూడిన గౌరవం. వీటితోపాటు పుస్తక ముద్రణలో భాగంగా కొన్ని తెలంగాణ గ్రంథాలను ముద్రించింది. ముఖ్యంగా లక్షపదాలతో 'తెలంగాణ నిఘంటువు'ను తీసుకువచ్చింది. తెలంగాణ సాహిత్య, సాంస్కృతి సంబంధిత అంశాలపై పరిశోధనలు చేయిస్తుంది.

## ఇతర విశ్వవిద్యాలయాలు:

తెలంగాణలో తెలుగుశాఖలు ఉస్మానియా, కాకతీయ, తెలుగు, తెలంగాణ, పాలమూరు, శాతవాహన, గాంధీ, కేంద్రీయ విశ్వవిద్యాలయలలో గలవు. ఈ విశ్వవిద్యాలయాలు అన్నీకూడా తెలంగాణ ఉద్యమం ప్రారంభం నుండి తెలంగాణ సాహిత్యం, భాషల స్పృహతో పనిచేస్తున్నాయి. తెలంగాణ సాధన అనంతరం బోధించే పాఠ్యాంశాలలో, చేయించే పరిశోధనలో పూర్తిస్థాయిలో తెలంగాణ సాహిత్యాన్ని తీసుకువచ్చారు. ప్రత్యేకించి తెలంగాణకు సంబంధించిన సాహితీవేత్తలపై, కావ్యాలపై, కథలు, నవలలు, కవిత్వం, ఉద్యమ సాహిత్యం మొదలగు అంశాలను తీసుకుని విస్తృత పరిశోధనలు చేస్తున్నారు. విశేషంగా భాషా, సాహిత్యాలపై ఈ విశ్వవిద్యాలయాలు నిర్వహించిన జాతీయ, అంతర్జాతీయ సదస్సు కొనియాడదగినవి. కాకతీయ విశ్వవిద్యాలయంలో 'తెలంగాణ తెలుగు కథ', 'తెలంగాణ నవల', 'తెలంగాణ నాటకం', 'తెలంగాణ విమర్శ' పేర్లతో నిర్వహించిన సదస్సులు హర్షణీయమైనవి. ఇందులో కొన్ని పుస్తకాలుగా రావడం ఆనందనీయం. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 'తెలంగాణ సాహిత్య సమాలోచనం', 'సినారె సాహితీ వైభవం', 'తెలంగాణ పాట – సమగ్ర సమాలోచన', 'తెలంగాణ భాషా సమాలోచన' వంటి అంశాలపై సదస్సులు నిర్వహించి ఎన్నో విలువైన అంశాలపై చర్చను రేకెత్తించాయి. తెలంగాణ విశ్వవిద్యాలయం నుండి 'తెలంగాణ ప్రాచీన కావ్యాలు', 'వృత్తి సాహిత్యం' అంశాలపై సదస్సులు జరిగాయి. ఈ మధ్య కాలంలో శాతవాహన విశ్వవిద్యాలయంలో 'తెలంగాణ ఉద్యమాలు – సాహిత్యం' పేరుతో సదస్సును నిర్వహించింది. ఇలాంటి సదస్సులు విశ్వవిద్యాలయాలు మాత్రమే కాకుండా వివిధ డిగ్రీ కళాశాలలు కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో నిర్వహించారు. తెలంగాణ ఆధునిక కావ్యాలు, తెలంగాణ పద్యసాహిత్యం, తెలంగాణ వచన కవిత్వం, కరీంనగర్ కథా సాహిత్యం, నల్గొండ జిల్లా సాహిత్యం, బి.ఎన్.శాస్త్రి సాహిత్య సమాలోచన వంటి అంశాలపై సదస్సులు నిర్వచించి సాహిత్యానికి మరింత పుష్టినిచ్చారు.




## పత్రికలు:

తెలంగాణ ఆవిర్భావానంతరం రెండు ప్రింటు సాహిత్య పత్రికలు నాలుగు వరకు అంతర్జాల పత్రికలు మొదలయ్యాయి. అందులో సాహిత్య అకాడెమి 'పునాస' పేరుతో త్రైమాసిక సాహిత్య పత్రికను ప్రారంభించింది. 'తంగేడు' పేరుతో కల్వకుంట్ల కవిత మొదలుపెట్టారు. అంతర్జాల పత్రికలు 'మయూఖ', 'తరుణి' పత్రికలను కొండపల్లి నిహారిణి, 'బహుళ' పత్రికను జ్వలిత, 'కొలిమి' పత్రికను అనిశెట్టి రజితతో కూడిన సమూహం నడుపుతున్నారు. ఈ పత్రికలు అన్నీ తెలంగాణ సాహిత్యాన్ని అన్ని కోణాలలో విశ్లేషిస్తూ ఆవిష్కరిస్తున్నాయి. ఎంతోకాలం నుండి నడుస్తున్న సాహిత్య పత్రికలు 'మూసీ', 'పాలపిట్ట', దక్కన్ ల్యాండ్, వంటి సాహిత్య పత్రికలు తెలంగాణ సాహిత్యానికే ప్రత్యేకమైన పేజీలను కేటాయించి వికాసానికి తోడ్పడుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పత్రిక 'తెలంగాణ' సాహిత్యానికి ఎంతగానో ప్రోత్సహిస్తుంది. 'జాతిరత్నాలు', 'అముద్రిత గ్రంథాలు' వంటి శీర్షికలతో ఎందరో సాహితీ మూర్తులను, వెలుగుచూడని విలువైన కావ్యాలను వెలుగులోకి తీసుకువచ్చింది.

తెలంగాణలో ప్రత్యేకంగా సృష్టించుకున్న కొన్ని ప్రక్రియలు కూడా దేశస్థాయికి వ్యాప్తి చెందినాయి. దానికి ఉదాహరణ 'నానీలు'. ఈ ప్రక్రియపై వందలాది గ్రంథాలు వచ్చాయి. కవిత్వంలో తీసుకువచ్చిన నూతన ప్రక్రియలలో 'మణిపూసలు', 'మొగ్గలు' వంటి మినీకవిత్వ రూపాలు చాలా మందితో ఆదరణ పొందినవి. కథా ప్రక్రియలో వచ్చిన మార్పులలో 'స్వగతాలు', 'కశప' (కథా శతక పద్యం) వంటివి విస్తృతంగా ముందుకు సాగుతున్నాయి. ఇలా అన్ని రకాల సాహిత్యాన్ని తెలంగాణ నుండి విరివిగ వెలువడడం అభినందనీయం.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 10 సంవత్సరాలు అవుతున్న సందర్భంలో మన అస్తిత్వాన్ని నిలుపుకుంటూనే ఇతర ప్రాంతాల భాష, సంస్కృతులను అవగాహన చేసుకుంటూ ఆయా రాష్ట్రాల కళలు, సాహిత్యం, సంస్కృతులను ఆదరిస్తూ మన తెలంగాణ సంస్కృతిని అన్ని భాషలు, రాష్ట్రాల వారికి పరిచయం చేస్తున్న అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలకు, ముఖ్యంగా అందరికీ తోడ్పాటునందిస్తూ ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వారికి ఈ సందర్భంగా ప్రత్యేక శుభాకాంక్షలు.